ప్రాణాలు అరచేతిలో..

మాదాపూర్, కావూరిహిల్స్‌లోని అనేక ప్రాంతాల్లో కిందికి వేలాడుతూ దర్శనమిస్తున్న విద్యుత్ తీగలు

- చిన్నపాటి గాలి వచ్చినా ప్రమాదమే
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ప్రజలు

మోతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ పరిధిలోని కావూరి హిల్స్, చందా నాయక్ తండ,అయ్యప్ప సొసైటీ, 100 ఫీట్ రోడ్, వివేకానంద నగర్, తదితర ప్రాంతాలలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు వణికి పోతున్నారు. పలు ప్రాంతాలలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ యమపాశాలుగా మారాయి. నిత్యం వాహనాల రాకపోకలతో జనసంచారం అధికంగా ఉండే మాదాపూర్ వంటి ప్రాంతాల్లోనే ఇటువంటి పరిస్థితి నెలకొని ఉంది. కావూరి హిల్స్ లోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని చోట్ల అయితే విద్యుత్ తీగలు రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మల్లో ఇరుక్కుపోయి దర్శనమిస్తున్నాయి. తండా ప్రాంతంలో ఒకే స్తంభానికి మెయిన్ లైన్, లూప్ లైన్, రెండు లైన్లు ఒకే స్తంభానికి లాగడం వల్ల స్తంభాలు ఒరిగిపోయి విద్యుత్ వైర్లు కిందికి వేలా


చెట్ల కొమ్మల్లో ఇరుక్కుని ఉన్న విద్యుత్ తీగలు

డుతూ ఉన్నాయి. పెద్ద పెద్ద వాహనాలు ఆ వైపుకు వచ్చినప్పుడు కర్రల సహాయంతో విద్యుత్ వైర్లను పైకి ఎత్తి పట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. అయ్యప్ప సొసైటీలో అయితే వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల చిన్నపాటి గాలి వచ్చిన విద్యుత్ వైర్లు ఒక దానికి ఒకటి కలుసుకొని నిప్పురవ్వలు కిందకు రాలుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కావూరిహిల్స్‌లోని కొన్నిచోట్ల రక్షణ కంచ లేకుండా తక్కువ ఎత్తులో రోడ్డుకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వల్ల మూగజీవాలు ఆ వైపునకు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. మరికొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఒంగి దర్శనమిస్తున్నాయి. వర్షాలు వచ్చినప్పుడు చిన్నపాటి గాలులకు సైతం స్తంభాలు విరిగి కింద పడిపోతున్నాయని ఆ సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్ కో అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడం మాని ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ పంపిణీ వ్యవస్థను సరిచేయాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.


రోడ్డు పక్కన తక్కువ ఎత్తులో రక్షణ కంచ లేకుండా ఏర్పాటు చేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మా దృష్టికి వస్తే పరిష్కరిస్తాం

మాదాపూర్, అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ పంపిణీ వ్యవస్థకు సంబంధించి విద్యుత్ లైన్లు కిందకి వేలాడుతుండడం, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ఎదురయ్యే సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తాం. ఇటువంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతి శనివారం ఎల్‌సి తీసుకుని ప్రతి లైన్ చెక్ చేస్తాం

\- సుధీర్ కుమార్ ఏఈ, మాదాపూర్


ఎస్పీఆర్ హిల్స్ గిరిజన బాలుర వసతిగృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

గిరిజన బాలుర వసతిగృహం పరిశీలన

యూసుఫ్‌గూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో ఉన్న గిరిజన బాలుర వసతిగృహాన్ని ఆదివారం కార్పొరేటర్ సిఎన్ రెడ్డి పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులను కలిసి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం వార్డెన్‌తో మాట్లాడుతూ, భోజనశాలకు వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు.

అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మదర్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్

వెంగళరావునగర్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ హెచ్-బ్లాక్ లోని ఎం.ఈశ్వరయ్య ఆర్ట్ గ్యాలరీలో మదర్ ఇండియా-2024 పేరుతో ప్రారంభమైన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నగరానికి చెందిన 14 మంది కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఉత్తమ చిత్రాలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి పి.విజయ, రెండో బహుమతి రాజేంద్ర కుమార్, మూడో బహుమతి కవిత కులకర్ణి గెలుచుకున్నారు. మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్ రావు, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, కాలనీవాసులు సందర్శించి చిత్రాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు, ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకుడు ఎం.సంజయ్ కుమార్, ఆర్టిస్ట్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్ రావు


కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్, కార్యవర్గ సభ్యులు

కేబీఎన్‌వై పార్క్‌లో బెంచీలు ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జెక్ కాలనీలోని విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేఎల్‌ఎన్‌వై పార్క్‌కు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం కోసం ఆదివారం బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌ఎన్ వై పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ గౌడ్, కార్యవర్గ సభ్యులతో పాటు, విశ్వ మానవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమ వెంకట్, వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్ రావు, జెక్ కాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లు ప్రసాద్, చందు, డీఎస్ రావు, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్తదానంలో పాల్గొన్న వారితో నిర్వాహకులు

'తలసీమియా' చిన్నారుల ప్రాణాలను రక్షించాలి

హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు అభిజిత్

పంజాగుట్ట, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలని హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు అభిజిత్ అన్నారు. అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వెస్ట్ శ్రీనివాసనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'సేవ్ లైఫ్ ప్రాజెక్ట్ లో భాగంగా తలసీమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన 52వ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 61 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సమితి వ్యవస్థాపకుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ప్రతినిధి సుందర్,సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాగంటి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దిష్టిబొమ్మ దహనం

బోరబండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాండ్‌లో గౌడ సంఘం నాయకులు ఆదివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బోరబండ సాయిబాబా నగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయన మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని నిరసన తెలుపుతూ మాగంటి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బండారి అశోక్, బాలరాజ్‌గౌడ్, ఆనంద్ గౌడ్, నరసింహ, గోగుళ్ల వెంకటేష్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే అత్యున్నత శిఖరాలకు..

- ప్రముఖ జర్నలిస్టు నాగేశ్వరరావు

ఎర్రగడ్డ, డిసెంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : సంపన్నుల పిల్లలే పెద్దవారు అవుతున్నారనేది వాస్తవం కాదని విద్యాభివృద్ధికి బలమైన సంకల్పం ఆత్మవిశ్వాసం ఉండాలని ప్రముఖ జర్నలిస్ట్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. రాజీవ్‌నగర్ లోని విద్యా వికాస్ సేవా సంస్థ 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం స్థానిక క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వికాస్ కార్యవర్గ సామాజిక స్పృహతో సమాజ సేవ చేస్తుందని దాని ఆశయాలు అభినందనీయమని కొనియాడారు. సరైన దృక్పథం ఉన్న విద్యార్థులు అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు.

పుస్తకాలు, విలువైన విషయాలు, పత్రికలు చదువుకునే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆడిటర్, సిఎంఎంఏ అసెస్మెంట్ టీం మెంబర్ వైవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం విద్య, వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యా వికాసంస్థ అధ్యక్షులు కృష్ణశర్మ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1428 మంది విద్యార్థులకు సుమారు రూ.21 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా వికాస్‌సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరమణ, కోశాధికారి ఎస్ రామ్మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎం బిసత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యా వికాస్ వార్షికోత్సవంలో ఉపకార వేతనాలు అందుకుంటున్న విద్యార్థులతో నిర్వాహకులు


శాసనసభ పక్ష సమావేశం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

\- (బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)

సింహగర్జన సభను చూసి ఓర్వలేకపోతున్నారు

- అంజలీకుమారి

ఖైరతాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయాన్ని పక్కనపెట్టి మంద కృష్ణ మాదిగ దళితుల అభివృద్ధి కోసం కృషి చేయాలని మాల మహిళా చైతన్య వేదిక అధ్యక్షురాలు అంజలీకుమారి అన్నారు.

ఆదివారం మాలల సింహ గర్జన సభ విజయవంతం కావడంపై ఖైరతాబాద్‌లో అభినందన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో అంజలీకుమారి మాట్లాడుతూ, మాలల సింహ గర్జన సభ చూసి మందకృష్ణ మాదిగ ఓర్వలేక పోతున్నారని, అందుకే మాల నేత వివేక్ వెంకటస్వామిపై అక్రోషం వెల్లగక్కుతున్నారని ఆరోపించారు. ఇక మీదట మాల నేతలను టార్గెట్ చేస్తే మాల మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు.


మాల మహిళా చైతన్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు అంజలీకుమారి

మాలలు రాష్ట్రంలో చెప్పుకోదగ్గ సంఖ్యలో లేరని చేసిన విష ప్రచారానికి సింహ గర్జన సభ చెంపపెట్టులాంటిదని, ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నించే రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు తాము గుణపాఠం చెప్పే రోజు త్వరలోనే ఉన్నదని హెచ్చరించారు. ఇందులో నాయకురాళ్లు బాలనర్సమ్మ, శ్వేత, మంగ, సబిత, దివ్య, మౌనిక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌భవన్‌లో "తెలంగాణ తిరువళ్లువార్ తమిళ్ సంగం" 17వ వార్షికోత్సవ వేడుకలను, 39వ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వైభవంగా అయ్యప్ప స్వామి పూజలు


అయ్యప్ప స్వామికి సహస్రకళాశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


పూజా మహోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

బంజారాహిల్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో మండల పూజాల్లో భాగంగా ఆదివారం అయ్యప్ప స్వామికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి హోమం అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు నింపిన కలశాలతో అయ్యప్ప మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప భస్మ చందన అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పడిపూజ, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

సైబర్ నేరాల్లో డబ్బు రికవరీలో.. దేశంలోనే తెలంగాణ టాప్

- ఈ ఏడాదిలో రూ.140 కోట్లు రికవరీ చేసి.. బాధితులకు అందజేత : డీజీపీ శిఖాగోయల్


ప్రసంగిస్తున్న శిఖాగోయల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను చేదించి, డబ్బు రికవరీ చేయడంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే టాప్‌లో ఉందని డీజీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు. హైటెక్స్ లోని శిల్పకళావేదికలో ఆదివారం జరిగిన టెడెక్స్ 10వ ఎడిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 170 రకాల మోసాలతో సైబర్ క్రిమినల్స్ మీ డబ్బును దోచుకుంటారని తెలిపారు. సుమారు 1200 మంది హాజరైన ఈ కార్యక్రమానికి ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఎంతో మంది రక్షించిన ట్యాంక్‌బండ్ శివ, సినీ దర్శకుడు నిర్మాత నాగ్ అశ్విన్, రవి ప్రభు, డాక్టర్ ప్రహ్లాద్ రామారావు ప్రఖ్యాత ఏరోస్పేస్ శాస్త్రవేత్త, ఎన్టీటీవీ ఎడిటర్ ఉమా సుధీర్, వహరేవాహ్ వెబ్‌సైట్ చెఫ్ సంజయ్ తుమ్మా, రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


యూసుఫ్‌గూడ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న ఆ పార్టీ నేతలు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు టీడీపీ శ్రేణులు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరం చేశారు. యూసుఫ్ గూడ డివిజన్‌లో మూడు రోజుల నుంచి అన్ని ప్రాంతాలలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కృష్ణానగర్ లేబర్ అడ్డా, కృష్ణానగర్ బి బ్లాక్, ప్రొడక్షన్ కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సాయిబాబా, ప్రొడక్షన్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


ఫిలింనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న ఆ పార్టీ నాయకులు నర్సింహులు, ఆటో సలీం, షేక్ సలీం

\- (బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)

ఆవిష్కరణకు వేళాయె..


సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ఏర్పాట్లను చేస్తున్న కార్మికులు

సంబురం.. అబ్బురం


ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సెక్రటేరియట్ సమీపంలోని హెచ్‌ఎండీఏ మైదానంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహించారు. వీటిని తిలకిస్తున్న ఆహూతులు

ట్రాఫిక్ జంఝాటం


ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్‌షో ముగిసిన తర్వాత సెక్రటేరియట్ మార్గంలో ట్రాఫిక్ జామ్

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్

● రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
● అవస్థలు పడుతున్న వాహనదారులు

బోయిన్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తోడు వివిధ రాష్ట్రాలు, వివిధ జిల్లాల నుంచి బోయిన్‌పల్లి మార్కెట్ యార్డుకు వచ్చే వాహనాల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ క్రమంలో బోయిన్‌పల్లి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రధాన రహదారుల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనికితోడు ఈ ప్రాంతంలో ఆరు నెలలుగా ట్రాఫిక్ సిగ్నల్ పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో గందరగోళం తలెత్తుతుంది. ప్రతిరోజు ఉదయం పాఠశాలలకు ఉద్యోగాలు, వ్యాపారాలకు వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారికి ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ విషయంపైన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు అధికారులు ట్రాఫిక్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడంలేదని అంటున్నారు. ఈ చౌరస్తాలో ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించాలి కానీ అప్పుడప్పుడు ఒకే ఒక సిబ్బంది విధులు నిర్వహిస్తుంటాడు. దీంతో సమస్య పరిష్కారం కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేసి ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్‌ను అదుపు చేయాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.


బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు చౌరస్తాలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

చలాన్లపై శ్రద్ధ



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు చౌరస్తాలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటుచేశారు. వాటి నిర్వహణ ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి కొద్ది రోజులు మాత్రమే పనిచేసాయి. పోలీసులకు చలాన్లపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై లేదు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో కూడా వాహనదారుల ఫొటోలు తీయడానికి సమయాన్ని వెచ్చిస్తున్నారు.

- రాయలకుమార్, బోయిన్‌పల్లి

సిగ్నల్ నిర్వహణ సక్రమంగా లేదు

నిత్యం వేలాది వాహనాలు వచ్చిపోయే ఈ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని, సిగ్నల్స్ వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడం, సిగ్నల్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే సమస్య తీవ్రంగా మారింది. దీనిపైన ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. దీంతో మార్కెట్ యార్డుకు సంబంధించిన సెక్యూరిటీ సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాము.

-వెంకన్న, మార్కెట్ యార్డు అధికారి


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

రైల్వే అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారుల తీరుపై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేటలోని హమాలీ బస్తీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, ఫంక్షన్ హాల్‌లను, రైల్ కళారంగ్ సమీపంలోని నల్ల పోచమ్మ దేవాలయాలను రైల్వే శాఖకు చెందిన స్థలంలో నిర్మించారని, వెంటనే ఖాళీ చేయాలని రైల్వే అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి రైల్వే అధికారులు ఇచ్చిన నోటీసులు చూపారు. ఇప్పుడు రైల్వే అధికారులు తమ స్థలం ఖాళీ చేయాలని చెప్పడంతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వెంటనే రైల్వే అధికారులకు లేఖ రాస్తానని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని, వెంటనే తమ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హమాలీ బస్తీకి చెందిన నాయకులు సుభాష్, కుషాల్, సత్తి, రవి కుమార్, అంజయ్య, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న టాటా ఏఐఏ ఉద్యోగులు

ఆర్థిక భరోసా ఎంతో ముఖ్యం

● సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఏజెన్సీస్ భరణీ యరాడ

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ కూడా ఓ సేవ లాంటిదని, దీనిద్వారా ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పిస్తామని, ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, రక్షణ, ఆర్థిక భరోసా ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఏజెన్సీ భరణీ యరాడ అన్నారు. ఆదివారం పీవీ మార్గ్‌లోని సంజీవయ్య పార్క్ వద్ద దిగ్గజ వ్యాపార వేత్త రతన్ టాటా జయంతి మాసాన్ని పురస్కరించుకొని ఇన్సూరెన్స్ ఫర్ ఆల్ అవర్ మోటో పేరిట టాటా ఏఐఏ ఉద్యోగులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రతన్ టాటా 1937లో జన్మించారని అందుకని ఆయన జ్ఞాపకార్థం ఈ డిసెంబర్‌లో 12వ తేదీలోగా 1937 కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఇన్సూరెన్స్‌పై అందరికీ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ర్యాలీని నిర్వహించామని వివరించారు. మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్‌లో టాటా ఏఐఏ దేశంలోనే రెండవ స్థానంలో ఉందన్నారు. ర్యాలీలో రీజనల్ హెడ్ (ట్రైనీ) శ్యాంప్రసాద్, ఏడీఓ జితేంద్రఫణి కుమార్, పురుషోత్తం, రాఘవేంద్ర చారి, సాయినాథ్, యాదగిరి, ప్రశాంత్, బాల నర్సింగ్‌లతో పాటు కుకట్ పల్లి, మెహదీపట్నం, బేగంపేట, సికింద్రాబాద్, ఏఎస్‌రావు నగర్, దిల్‌షుక్ నగర్, హిమాయత్ నగర్, కరీంనగర్ బ్రాంచీలకు చెందిన దాదాపు నాలుగు వందల మంది ఉద్యోగులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న సిక్కులు

భక్తిశ్రద్ధలతో విశాల్ కీర్తన్ దర్బార్

బౌద్ధనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ సిక్కు గురు తేజ్‌బహదూర్ సాహెబ్‌జీ 349వ బలిదాన దినోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతాఫల్‌మండిలోని గురుద్వారా గురుసింగ్ సభ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విశాల్ కీర్తన్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సిక్కులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు ఎస్ ప్రతాప్‌సింగ్ ఒసాహన్, కార్యదర్శి ఎస్.రంజిత్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. ప్రత్యేకంగా ఆహ్వానించిన పంజాబ్‌కు చెందిన మతగురువులు దామ్‌దామా సాహెబ్, భాయ్ బిందర్ సింగ్, బాబా బుద్దసాహెబ్ మత సామరస్యాన్ని పెంపొందించే షాబాద్ కీర్తనలు ఆలపించారు. ఆదివారం రాత్రి ప్రత్యేక వాహనంపై గురు గ్రంథ్‌ను సీతాఫల్‌మండి గురుద్వార్ నుంచి సీతాఫల్ మండి చౌరస్తా, మైలార్‌గడ్డ, చిలకలగూడ మీదుగా ఊరేగించారు. ఈ సందర్భంగా సిక్కులు పలు విన్యాసాలను నిర్వహించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి

హైదర్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డినగర్‌లో శనివారం రాత్రి మినిస్ట్రీస్ సెమీ క్రిస్మస్ వేడుకలు చర్చి ఫాదర్ అలిగస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాపిరెడ్డినగర్ కాంటెస్టింగ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వారికి అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యకరమంలో పాస్టర్లు సోలమన్, జైపాల్‌రెడ్డి, తెట్టెబావి ఆనంద్, కృపాల్‌రెడ్డి, ప్రమోద్, సునీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

మారేడుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మారేడుపల్లి జీహెచ్ఎంసీ క్రీడా మైదానంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ మాజీ ఛైర్మన్ సి.సంతోష్ యాదవ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందరబంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, ఆంజనేయులు, సి.వైష్ణవి, శ్యాంసుందర్ రెడ్డి, జగ్గం మహేష్, బాబురావు, భాస్కర్, నర్సింగ్ యాదవ్, కంటోన్మెంట్ మహిళా గ్రూప్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, నాయకులు సంతోష్ యాదవ్

బైక్ ర్యాలీని ప్రారంభం

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పికెట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సెక్రెటేరియేట్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆదివారం ఎమ్మెల్యే శ్రీగణేష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్ యాదవ్‌తో పాటు యువకులు భారీగా తరలివచ్చి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

వెంకట్‌నగర్‌లో నల్లాలో మురుగు నీరు సరఫరా

● ఇరవై రోజులుగా ఇదే తీరు
● స్పందించని అధికారులు

అడ్డగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని వెంకట్‌నగర్‌లో ఇరవై రోజులగా మంచినీటి నల్లాలో మురుగు నీరు సరఫరా అవుతుందని మారేడుపల్లి జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకట్‌నగర్‌లోని 10-5779/37/ఎ, 38/1, 39/33,779/40, 779/38/ఎ తో పాటు పలు ఇళ్లలోకి మంచినీటి నల్లాలో మురికి నీరు చేరుతుంది. పైప్‌లైన్‌లో ఎక్కడ పొరపాటు జరుగుతుందో జలమండలి అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఫిర్యాదు చేస్తే సమస్య ఎక్కడ వచ్చిందో చూస్తున్నామంటున్నార తప్పా పరిష్కరించడంలేదు. వెంకట్‌నగర్‌లో ఈ పరిస్థితి ఉండడంతో మినరల్ వాటర్ క్యాన్‌లు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కనీసం తాగేందుకు నీళ్లు లేక అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్‌పై స్థానికుల ఆగ్రహం

డివిజన్‌లోని వెంకట్‌నగర్‌లో ఈ పరిస్థితి ఉందని స్థానికులు చాలా మంది అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పట్టించుకోకపోవడంతో కార్పొరేటర్ భర్త లింగాని శ్రీనివాస్‌కు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. బీఆర్ఎస్ కార్యక్రమాలకు మందిబలం కావాలంటే తమ బస్తీకి వస్తున్నారని, ముఖ్యమైన సమస్య తీర్చమంటే కనీసం పట్టించుకోవడంలేదని వెంకట్‌నగర్ మహిళలు కార్పొరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బస్తీలో సమస్యలు ఉంటే కార్పొరేటర్‌కు ఫోన్ చేయాలా? లేదంటే ఆమె భర్తకు ఫోన్ చేయాలా? అర్థం కావడం లేదని వాపోయారు.


నలుపు రంగు నీళ్లు చూపిస్తున్న మహిళ

11న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఈ నెల 11వ తేదిన నిర్వహించనున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఆలయంలో చివరి దశలో ఉన్న ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఉన్మాది చేతిలో అమ్మవారి విగ్రహం ధ్వంసం అయిన సంఘటనలో పునఃనిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విగ్రహ పతిష్ఠాపన కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ,హైదారాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు.

ముళ్లపొదలో కుళ్లిపోయిన మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముళ్లపొదలో కుళ్లిపోయిన ఓ వ్యక్తి మృతదేహన్ని రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్‌రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ముళ్లపొదలో కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ముళ్లపొదలో వ్యక్తి పూర్తిగా కుళ్లిపోయి ఉండడతో మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు పట్టాలు దాటుతుండడం లేదంటే ఏదైనా కారణంగా రైలు ఢీకొని చనిపోవచ్చని అక్కడి పరిస్థితులను బట్టి రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి చేయికి రాగి కడెం, తెలపు రంగు చొక్కా, బనీను ఉందని ఈ వ్యక్తి ఆనవాళ్లు తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

సబ్సిడీ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన గోదాంపై దాడి

రామంతాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ భగాయత్ పరిధిలోని బాలకృష్ణనగర్‌లో సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా నిలువ చేసిన గోదాంపై ఉప్పల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. సబ్సిడీ బియ్యంను అక్రమంగా నిలువ చేసిన పాత మలక్‌పేట్ వహీద్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోహెబ్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

అల్వాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆదివారం సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకొని భక్తులు తరించారు. అంతకు ముందు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ , ఈఓ మఠం వీరేశం, భక్తులు వెంకట్‌రామ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, స్వామి, శ్రీకాంత్, అర్చకులు విజయ సారథి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

ఉప్పల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి దూరం కావడంతో పాటు యువతి తల్లిదండ్రులు పెట్టిన కేసుతో జైలుకు వెళ్లి రావడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన శనివా రం అర్ధరాత్రి దాటాక ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజ్మత్‌నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జగద్గిరిగుట్టలో సుమారు 20 ఏళ్లుగా నివాసం ఉంటూ సెంట్రింగ్ పని చేసుకుంటున్న నిలుగురి కుమార్ మూడు నెలల క్రితం ఉప్పల్ అజ్మత్‌నగర్‌కు వచ్చి ఇళ్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతని కుమారుడు రఘుప్రసాద్(20) హబ్సిగూడలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను జగద్గిరిగుట్టలో ఉన్నప్పుడు ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఆ యువతి తల్లిదండ్రులో పోలీసు కేసు పెట్టడంతో రఘుప్రసాద్ జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో మకాంను అజ్మత్‌నగర్‌కు మార్చారు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత రఘుప్రసాద్ వేరే గదిలోకి వెళ్లి గడియ పెట్టుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఉదయం నిద్రలేచే సరికి కొడుకు కనిపించకపోవడంతో కంగారుపడ్డ తండ్రి పక్కగది తలుపులను గట్టిగా నెట్టి చూడగా రఘుప్రసాద్ ఉరేసుకొని కనిపించాడు. వెంటనే కిందికి దించి స్థానిక ప్రైవేటు అసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ జీఎం ప్రకాష్ చంద్ర బరోరా

విదేశీ విద్యకు ఎస్‌బీఐ భరోసా

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలనే విద్యార్థుల కలకు ఎస్‌బీఐ భరోసా కల్పిసుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర బరోరా అన్నారు. ఆదివారం విదేశీ విద్యాభ్యాసం కోసం విద్యార్థులకు రుణాల మేళాను ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తదితర విదేశాలలో ఉన్న టాప్ 100 యూనివర్సిటీలలో చదువుకునేందుకు విద్యా రుణాలను అందిస్తున్నామన్నారు. గత సంవత్సరం దేశ వ్యాప్తంగా లక్ష ఇరవై ఏడు వేల మంది విద్యార్థులకు రూ.10880 కోట్ల విద్యారుణాలు అందించిన ఘనత ఎస్‌బీఐకే దక్కుతుందన్నారు. ఎస్‌బీఐ వీధి వ్యాపారుల నుంచి ఏయిర్ పోర్టులు, షిప్ యార్డులు, జాతీయ రహదారులతో పాటు అనేక భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు అందిస్తుందన్నారు. ఈ మేళాలో దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి ప్రీ అప్రూవల్ లెటర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎంలు వినోద్ కస్తూరీ, రవీంద్ర, వివేక్ చంద్ర జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.


మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా నియమాక పత్రాలను అందుకున్న కొత్త కార్యవర్గం

మాలల ఐక్యత కోసం పనిచేస్తా

● జయకుమార్

అడ్డగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజక వర్గంలో మాలల ఐక్యత కోసం శ్రమించి పనిచేస్తానని మాల మహానాడు సికింద్రాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమితులైన ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన జయకుమార్ అన్నారు. ఆదివారం ఆజాద్ చంద్రశేకర్‌నగర్ బస్తీలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యత కోసం నిరంతరం సంఘం కులం కోసం పనిచేస్తానన్నారు. మాలల ఐక్యత కోసం జాబితాను తయారు చేస్తామన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన మాలల ముఖ్య నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదే విదంగా బస్తీలో కొత్తగా కమిటీ వేశారు. మాల మహానాడు సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా నేతల రమేష్, సికింద్రాబాద్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రామలీల, ప్రధాన కార్యదర్శిగా పుష్పలత, నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా తుంగ నర్సింగ్ రావులు నియమితులయ్యారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, గుమ్మాల కమల్ కుమార్, ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు బూరుగు రమేష్‌లు కలిసి కొత్త కమిటీలో ఉన్న కొత్త సభ్యులకు నియమాక పత్రాలను అందజేశారు.

సైబర్ నేరాల్లో డబ్బు రికవరీలో.. దేశంలోనే తెలంగాణ టాప్

● ఈ ఏడాదిలో రూ. 140 కోట్లు రికవరీ చేసి.. బాధితులకు అందజేత : డీజీపీ శిఖాగోయల్


ప్రసంగిస్తున్న శిఖాగోయల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను చేదించి, డబ్బు రికవరీ చేయడంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే టాప్‌లో ఉందని డీజీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ పేర్కొన్నారు. హైటెక్స్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం జరిగిన టెడెక్స్ 10వ ఎడిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 170 రకాల మోసాలతో సైబర్ క్రిమినల్స్ మీ డబ్బును దోచుకుంటారని తెలిపారు. సుమారు 1200 మంది హాజరైన ఈ కార్యక్రమానికి ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఎంతో మంది రక్షించిన ట్యాంక్‌బండ్ శివ, సినీ దర్శకుడు నిర్మాత నాగ్ అశ్విన్, రవి ప్రభు, డాక్టర్ ప్రహ్లాద్ రామారావు ప్రఖ్యాత ఏరోస్పేస్ శాస్త్రవేత్త, ఎన్డీటీవీ ఎడిటర్ ఉమా సుదీర్, వహరేవాహ్ వెబ్‌సైట్ చెఫ్ సంజయ్ తుమ్మా, రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు.

ఆవిష్కరణకు వేళాయే..


సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ఏర్పాట్లను చేస్తున్న కార్మికులు

సంబురం.. అబ్బురం


ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సెక్రెటేరియట్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహించారు. వీటిని తిలకిస్తున్న ఆహుతులు

ట్రాఫిక్ జంఝాటం


ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన ఎయిర్‌షో ముగిసిన తర్వాత సెక్రెటేరియట్ మార్గంలో ట్రాఫిక్ జామ్